క్లుప్తంగా

సాయం అందించండి



చికిత్స పొందుతున్న పంచాయతీ కార్యదర్శి కోరాడ ఫణిధర్

మెళియాపుట్టి: పాలకొండ మండలంలోని గొట్టమంగళాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కోరాడ ఫణిధర్ పాలకొండలోని తన ఇంటివద్ద ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాళ్లు, చేతులు, కిడ్నీలు దెబ్బతిన్నాయి. ఆపరేషన్‌కు లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారని మెళియాపుట్టి మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు చింతల అప్పారావు మంగళవారం తెలిపారు. జిల్లాలో కార్యదర్శులు కొంతమంది వారికి కలిగిన సహాయాన్ని అందిస్తున్నారన్నారు. దాతలు పెద్దమనసుతో ఫణిధర్‌కు అండగా నిలవడానికి, ఆయన ప్రాణాలు కాపాడటానికి ముందుకు వస్తే 6281691501(కోరాడ ఫణిధర్) నంబర్‌కు ఫోన్ పే ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. కార్యదర్శుల సంఘం ఉపాధ్యక్షుడు శివాజీ, ఢిల్లీశ్వరరావు, మోహన్‌రావు తదితరులున్నారు.

ఘనంగా గ్రామ దేవత ఉత్సవాలు



ముర్రాటలో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలో గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముర్రాటలతో మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని చల్లదనం చేశారు. మొక్కులు చెల్లించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్జిన్ దాటొద్దు



టెంట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: కూరగాయలతోపాటు ఇతర షాపులు రోడ్డు మార్జిన్ కంటే ముందుకు వస్తున్నందు వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, వ్యాపారులు గమనించి సహకరించాలని నరసన్నపేట ఈఓ చిన్నారావు అన్నారు. స్థానిక కాలేజీ రోడ్డులో కూరగాయల షాపుల యజమానులు రోడ్డు మార్జిన్లు కంటే ముందుకు వచ్చి షాపులు నిర్వహిస్తుండటాన్ని గమనించి మంగళవారం వాటిని వెనక్కి పెట్టించారు. ముందుకు పెట్టిన టెంట్లను పంచాయతీ సిబ్బందితో తొలగింపజేశారు. కాలేజీ రోడ్డు మధ్యలో తోపుడు బళ్లు పెట్టి వ్యాపారాలు చేయవద్దని సూచించారు. వాహనదారులు కూడా తమ వాహనాలను షాపుల ముందు రోడ్డుకు అడ్డంగా పెట్టవద్దన్నారు. వ్యాపారులు, వాహనదారులు, టౌన్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న వెంకటరమణ

మెళియాపుట్టి: మండలంలోని సుందరాడ గ్రామానికి చెందిన దకర వెంకటరమణకు డాక్టరేట్ దక్కింది. రాజమండ్రిలోని నన్నయ విశ్వవిద్యాలయంలో అక్కడి ఇన్‌చార్జి శ్రీనివాసరావు చేతులమీదుగా మంగళవారం డాక్టరేట్ అందుకున్నారు. సాహిత్యం-సమాలోచన అనే అంశంపై పరిశోధన చేసినట్లు వెంకటరమణ తెలిపారు.

● సినిమా షూటింగ్ ప్రారంభం



ఆమదాలవలస పట్టణంలోని పాలపోలమ్మ అమ్మవారి ఆలయం ఆవరణలో 'ఆకలి' మూవీ షూటింగ్‌ను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మంగళవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. కళింగ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై గూన అప్పారావు స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోలుగా ప్రకాష్, విక్రమ్, హీరోయిన్లుగా ప్రసన్న, స్రవంతి, పలు పాత్రల్లో సనపల అన్నాజీరావు, బమ్మిడి కృష్ణారావు, కుమార్ నాయక్, దుర్గా వెంకటగిరి, మోహన్‌రావు, వెంకటరావు తదితరులు నటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మొదలవలస రమేష్, తంబి, తమ్మినేని శేఖర్ పాల్గొన్నారు. - ఆమదాలవలస

● అవగాహన

వరుస పద్ధతి (లైన్ షోయింగ్‌పై)లో వరి నాట్లు వేసుకోవాలని వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు సూచించారు. సారవకోట మండలంలోని చిన్నగుజ్జువాడలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసేటప్పుడు చిగుళ్లు తుంచాలన్నారు. దీని వల్ల చిగుళ్లలో ఉన్న పురుగులు, వాటి గుడ్లు నాశనమవుతాయన్నారు. మొక్కకు సూర్యరశ్మి, గాలి బాగా లభిస్తాయన్నారు. మొక్క ఏపుగా పెరిగి దిగుబడి అధికంగా వస్తుందన్నారు. - సారవకోట



● గోతులమయం



అలికాం నుంచి బత్తిలి వరకు గల ఆర్అండ్‌బీ రహదారిలో సరుబుజ్జిలి జంక్షన్‌లో వాహనదారులకు ఫీట్లు తప్పడంలేదు. నిత్యం ఈ రహదారిలో వందలాది వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. జిల్లా అధికారులు కూడా తరచూ వస్తుంటారు. రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్ల కాలువలు పూడికపోయి వర్షంనీరు రోజుల తరబడి రోడ్డుపై నిల్వ ఉంటుంది. రోడ్డుపై పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడి చెరువును తలపిస్తుంది. కొత్తగా ప్రయాణం చేసినవారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు, కోరుతున్నారు. - సరుబుజ్జిలి

● యంత్రాల పంపిణీ

ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మంజూరైన చీపురు కటింగ్ యంత్రాలను సారవకోట మండల కేంద్రంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం గిరిజనులకు పంపిణీ చేశారు. చీపురు సాగు చేస్తున్న గిరిజనులను ఎంఎంఎస్ ద్వారా గుర్తించి 10 చీపురు కటింగ్ యంత్రాలను అందించారు. ఒక్కొక్క యంత్రంతో రోజుకు 300 చీపుర్లు తయారు చేయకోవచ్చునన్నారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ఎంపీడీఓ రాంబాబు, ఏపీఎం గోవిందరాజులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. - సారవకోట



● ఆవేటి వారాల సందడి



మేజరు పంచాయతీ నరసన్నపేటతోపాటు పరిసర గ్రామాల్లో మంగళవారం ఆవేటి వారాల సందడి నెలకొంది. నరసన్నపేట టౌన్‌లో మారుతీనగర్, బజారు, మఠం వీధుల్లో అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. శాంతామణి ఆలయంలో అమ్మవారు నిజరూప దర్శనమిచ్చారు. పైడితల్లి అమ్మవారు, నూకాంబికా, నాయుడు వీధుల్లో అమ్మవారి ఆలయాల్లో భక్తులు ముర్రాటలు చెల్లించి మొక్కలు తీర్చుకున్నారు. - నరసన్నపేట

వాడీవేడిగా ఉపాధి గ్రామసభ



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ నరేష్

సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడు గ్రామంలో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామ సభ మంగళవారం వాడీవేడిగా జరిగింది. సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో పంచాయతీలో ఇప్పటివరకు చేపట్టిన ఉపాధి పనులు, వేతనదారులకు చెల్లించిన బిల్లులు, సోషల్ ఆడిట్ బృందం వేతనదారుల నుంచి సేకరించిన వివరాలను అంశాల వారీగా డీఆర్పీ నరేష్ సభలో చదివి వినిపించారు. జాబ్‌కార్డులు వేతనదారుల వద్ద ఉండడంలేదని, జాబ్‌కార్డుల్లో హాజరు నమోదు, సంతకాలు లేనట్లు గుర్తించామని వెల్లడించారు. వేతన రసీదులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేవన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు మెట్ట రాము, సర్పంచ్ భర్త బిర్లంగి నాగేశ్వరరావుతోపాటు మరికొంతమంది ఇచ్చిన ఫిర్యాదులను కూడా పరిగణలోకి తీసుకొని తనిఖీలు చేసినట్లు తెలిపారు. మామిడి రాము, పేడాడ నారాయణమ్మ, గురుగుబెల్లి అమ్మాయమ్మ, చెవ్వాకుల బ్రహ్మం, భవాని, కృష్ణవేణి కొన్ని రోజులు పనులకు వెళ్లకుండా మస్టర్లు నమోదైనట్లు గుర్తించామన్నారు. లాయర్‌గా పనిచేస్తున్న గొండు వాసుదేవరావు తక్కువ రోజులు పనికి వెళ్లినా అధికంగా మస్టర్లు నమోదు చేశారని వెల్లడించారు. ఆశ వర్కర్‌కు ఒంటరి మహిళ పింఛన్ అందిస్తున్నట్లు గుర్తించారు. గ్రామంలో సోషల్ ఆడిట్ ఏకపక్షంగా నిర్వహించారని, డీఆర్పీ సేకరించిన అంశాలు చాలావరకు వాస్తవానికి దూరంగా ఉన్నాయని ఫీల్డ్‌అసిస్టెంట్ కె.గణపతిరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ ఆడిట్‌తోపాటు, సభలో సేకరించిన అంశాలపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ రామారావు వెల్లడించారు. కొంతసమయం సభలో గందరగోళం నెలకొంది. వెంటనే ఎస్ఐ కృష్ణప్రసాద్ జోక్యం చేసుకుని శాంతింపజేశారు. ఈ సమావేశంలో ఉపాధి ఏపీఓ పార్వతి, ఈసీ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.

దిద్దుబాట్లు, కొట్టివేతలపై ఆగ్రహం



మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం వేతనదారుల హాజరు నమోదులో కొట్టివేతలు, దిద్దుబాటులు ఉంటే ఎఫ్ఏలే బాధ్యులవుతారని డ్వామా పీడీ చిట్టిరాజు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 455 ఉపాధి పనులు చేసేందుకు రూ.13.26 కోట్లు ఖర్చు చేయటం జరిగింది. దీనిపై ఈ నెల 19వ తేదీ నుంచి సామాజిక తనిఖీ చేపట్టారు. మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక (సోషల్ ఆడిట్) నిర్వహించారు. సామాజిక తనిఖీ డీఆర్పీలు గ్రామాల్లో గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. పలు పంచాయతీల్లో మస్టర్లలో దిద్దుబాటులు, కొట్టివేతలు ఉన్నట్లు ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ.. ప్రతీ వారం పనులు పూర్తయిన తరువాత మస్టర్లలో వేతనదారుల సంతకాలు, హాజరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో?లేదో? చూసుకోవల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. పనులు ప్రారంభం నుంచి పూర్తయినంత వరకు అన్ని స్థాయిల్లో ఫొటోలు తీసుకుని ఫైల్ సిద్ధంగా ఉంచుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలకు సూచించారు. పెద్దకోట పంచాయతీలో పనిలోకి వెళ్లని వారి పేర్లు నమోదు చేసినట్లు గుర్తించిన డీఆర్పీ ప్రజావేదికలో చదివి విపించారు. ఇందుకు సంబంధించి విచారణ చేయించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు. చింతలబడవంజ గ్రామానికి చెందిన చింతాడ రమణ 2023లో 34 రోజులు పనిచేశారని, రూ.8,440 వేతనం అందలేదని ఫిర్యాదు చేసినట్లు డీఆర్పీ తెలిపారు. ఆయనకు సంబంధించిన వేతనాలు బ్యాంక్ ఖాతాకు జమచేయటం జరిగిందని ఏపీఓ తెలిపారు. పలు గ్రామాల్లో ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లలో అక్రమాలు జరుగుతున్నాయని పలువురు డీఆర్పీలు వివరించారు. వీటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీపీ మేనేజర్ చింతాడ రామ్మోహనరావు తెలిపారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, విజిలెన్స్ అధికారి లవరాజు, క్లస్టర్ ఏపీడీ పి.రాధ, డ్వామా మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ గిరిబాల, ఏపీఓ వి.శ్రీదేవి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, ఎస్సార్పీ తిరుపతిరావు, పీఆర్ ఏఈ భాస్కరరావు, ఐకేపీ ఏపీఎం రవిరాజ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపాధి, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

పాతపట్నం: కొత్తూరు మండలంలోని మెట్టూరుకు చెందిన పెద్దకోట నందిని, తండ్రి శ్రీనివాసరావు కలిసి ఆదివారం ఉదయం బస్సులో టెక్కలి వెళ్తుండగా మార్గమధ్యలో పదో తరగతి మార్కుల లిస్ట్, టీసీ, ఇతర సర్టిఫికెట్లు పోగొట్టుకున్నారు. సోమవారం ఉదయం తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అదే గ్రామానికి చెందిన హేమసుందరరావు, ధనలక్ష్మికి సర్టిఫికెట్లు దొరికాయి. వీటిని హెచ్ఎం విశ్వనాథం, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మాధవరావుకు విద్యార్థులు అప్పగించారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు మంగళవారం అభినందించారు. సర్టిఫికెట్లలో ఉన్న ఆధారాల మేరకు నందినికి సర్టిఫికెట్లు అందజేశారు.

నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తాం

సరుబుజ్జిలి: లింక్ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ డీఈ జె.చంద్రశేఖర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. లింకు రోడ్లు కనుమరుగు అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. ఏబీ రోడ్డు నుంచి చినషళంత్రి వరకు రూ.1.50 కోట్లతో రహదారి నిర్మాణం కోసం ఏరో కన్‌స్ట్రక్షన్స్‌కు 2018 అప్పగించామన్నారు. గుత్తేదారుడు పనులు ప్రారంభించలేదన్నారు. మరలా అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. శిథిలమైన రహదారులను పరిశీలించి నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తామని వెల్లడించారు.

అంతర పంటలతో అధిక లాభాలు



అల్లం విత్తనాలు పంపిణీ చేస్తున్న మంగమ్మ

మెళియాపుట్టి: గిరిజన ప్రాంతాలలో అత్యధికంగా పోడు వ్యవసాయంతో ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తున్నామని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సీసీ జగన్ అన్నారు. గొట్టిపల్లి, గొడ్డ, కేరాసింగి, ఇల్లాయిపురం, వీరన్నపేట, నేలబొంతు గ్రామాలకు చెందిన 55 మంది గిరిజన రైతులకు గొడ్డ గ్రామంలో అల్లం విత్తనాలు చెరో 10 కేజీలు మంగళవారం అందజేశారు. రూ.1175 విలువ చేసే విత్తనాలను రైతు వాటా కేవలం రూ.325 లకే అందిస్తున్నామన్నారు. గిరిజనులు అంతర పంటల ద్వారా అత్యధిక ఆర్థిక ప్రయోజనం పొందాలనేదే ముఖ్య ఉద్దేశమన్నారు.ఉద్యానవన శాఖ అధికారి శరత్, మొబలైజర్స్, రైతులు పాల్గొన్నారు.

పోడు వ్యవసాయం ఎంతో మేలు..

పాతపట్నం: గిరిజన రైతులు పోడు వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల ఉద్యానవన శాఖ అధికారి మంగమ్మ అన్నారు. సోధ పంచాయతీ పరిధిలోని గిరిజన గూడల్లో కొత్తూరు వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు మంగళవారం అల్లం విత్తనాలు పంపిణీ చేశారు. వెలుగు అసోసియేషన్ ఏసీఓ నాగరాజు, సీసీ జి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

కొత్తూరు: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే పాఠశాల అనుమతులు రద్దు చేస్తామని ఎంఈఓ చందక గోవిందరావు తెలిపారు. ఆర్జేడీ ఆదేశాల మేరకు కొత్తూరులోని మూడు ప్రైవేట్ పాఠశాలలను మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్యను, హాజరైన విద్యార్థుల సంఖ్యలో తేడాను ఓ పాఠశాలలో గుర్తించారు. విద్యార్థులపై ఒత్తిడి లేని బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎల్.ఎన్.పేట/కొత్తూరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లోను పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎల్‌పీఓ ఐవి రమణ అన్నారు. ఎల్.ఎన్.పేట, కొత్తూరు మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. గ్రామాల్లోని వీధి రోడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఇంటి పన్నులు వసూలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై చొరవ చూపాలి..

ఆమదాలవలస: పరిసరాల పరిశుభ్రతపై మహిళలు చొరవ చూపాలని వెలుగు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని దూసి పంచాయతీలో మహిళా సంఘాలకు పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్ కార్యక్రమాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

ఎరువుల విక్రయాలపై ఆరా

పోలాకి: ఖరీఫ్ సాగు ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎరువుల కొరత, ప్రైవేట్ డీలర్ల వద్ద అమ్మకాలపై పర్యవేక్షణ తదితర అంశాలపై ఆరా తీశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీధర్ నియోజకవర్గంలోని పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న ఎరువుల వివరాలను తెలియజేశారన్నారు. నానో ఎరువులు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో ఏడీఏ రవీంద్రభారతి, నాలుగు మండలాల ఏఓలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



యూడైస్‌ను పూర్తిచేయండి

పొందూరు: మండలంలోని అన్ని పాఠశాలల్లో యూడైస్ (సమగ్ర సమాచారం) కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంఈఓ-2 పట్నాన రాజారావు హెచ్ఎంలకు ఆదేశించారు. మండలంలోని లోలుగు కేజీబీవీని మంగళవారం సందర్శించి యూడైస్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం

పొందూరు: ఉపాధి హామీ పథకం నిధులతో వ్యవసాయం, అనుబంధ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ కె.లోకేష్ అన్నారు. మంగళవారం పొందూరు ఎంపీడీఓ కార్యాలయంలో పొందూరు, ఆమదాలవలస, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయాధారిత పనులకు సంబంధించి అంచనాలను త్వరగా తయారు చేయాలని సూచించారు. సాగునీటి కాలువల పనులు, రైతులకు సుస్థిర ఆదాయాన్నిచ్చే పండ్ల తోట పనులు, ఫారంపాండ్ల తవ్వకం పనులు, చెరువుల్లో చేపలు పెంచేందుకు తవ్వే పనులు వంటివి త్వరగా రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.